

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ సలాం షాహిద్

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చావునీ డివిజన్‌లోని కుర్మగూడ లేన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదివారం ప్రారంభించారు. రూ.25లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన వివరించారు. చావునీ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో చావునీ డివిజన్ కార్పొరేటర్ ఎంఏ సలాం షాహిద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం: కార్పొరేటర్

సైదాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య సేవలు నిర్వహించడం అభినందనీయమని ప్రతి ఒక్కరూ ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ఉపయోగకరమని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి అన్నారు. జన హిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం శంకేశ్వర్‌బజార్‌లోని భవానీ శంకర ఆలయం వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ముందస్తు ఆరోగ్య పరీక్షల ద్వారా సకాలంలో వ్యాధి నిర్ధారణ అవుతుందని, తద్వారా సకాలంలో చికిత్స పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు చిలుకూరి రాంరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సభ్యులు గజానంద్, కిషోర్, మహాలక్ష్మి, చంద్రయ్య, సాయిబాబా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

కొత్తపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): స్నేహపురికాలనీ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన కాలనీ రోడ్ నెం.-1, పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నీరు లోతట్టు అంతర్గత దారుల్లో నిలువకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు నీరంకి రవి, కాలనీవాసులు మహేందర్, వెంకట్‌రావు, తిరుమల్‌రెడ్డి, యాదగిరి, శాంతామూర్తి పాల్గొన్నారు.



కళాకారులను సన్మానిస్తున్న పీఠాధిపతి విజయశంకర స్వామి తదితరులు

భక్తితత్వమే హిందూమతం లక్షణం

● అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి

వనస్థలిపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): భక్తితత్వమే హిందూమత లక్షణమని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి అన్నారు. వనస్థలిపురంలోని సురభి వినాయక నాట్యమండలి ప్రాంగణంలో ఆదివారం హైందవ భక్తి కళా సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయశంకరస్వామి మాట్లాడుతూ హిందూ ధర్మంలో విభిన్న స్రవంతులు, సంప్రదాయాలు ఎన్ని ఉన్నా, కేవలం భక్తి సంప్రదాయమే హైందవ సంస్కృతికి జీవగర్రగా ఉందన్నారు. అనంతరం పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, చెక్కభజన తదితర కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రమణమూర్తి, నర్సింహాచార్యులు, శివస్వామి, విజయారెడ్డి, చినుకు మూర్తి, సుందరరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సౌభాగ్యనగర్‌కాలనీలో కమ్యూనిటీహాల్ ప్రారంభం

వనస్థలిపురం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సౌభాగ్యనగర్ కాలనీవాసులు తమ సొంత నిధులతో నిర్మించుకున్న కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని శివారు ప్రాంత కాలనీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని, వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నందకిషోర్, గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, సురేష్, సరస్వతి, సంజీవరెడ్డి, లక్ష్మీపతి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

శివసాయినగర్‌లో శ్రావణమాస పూజలు

సరూర్‌నగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని శివసాయినగర్‌కాలనీలో గల గౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ఆదివారం శ్రావణమాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ, శ్రీగాయత్రీ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం పలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, వెంకటరమణ, శ్రీగాయత్రీ సేవా సంఘం ప్రతినిధులు శ్రీనివాసప్రసాద్, శివరామప్రసాద్, లక్ష్మణరావు, లక్ష్మీనర్సింహమూర్తి, ఆకెళ్ల మూర్తి, బాపిరాజు, రామచంద్రరావు, పార్థసారథి, ఆలయ అర్చకులు కృష్ణశర్మ, లక్ష్మీగణపతిరావు పాల్గొన్నారు.

బీజేపీని అధికారంలోకి తీసుకొద్దాం : సంరెడ్డి

సైదాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నాయకులు, కార్యకర్తలంతా సమష్టిగా పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొద్దామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం భాగ్యనగర్ జిల్లా బీజేపీ సభ్యత్వ నమోదు వర్క్‌షాప్ నిర్వహించారు. అందరూ ఒక్కటై శ్రమించి పాతబస్తీలో బీజేపీ జెండా ఎగురవేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడే సామాన్య కార్యకర్తకు గుర్తింపు బీజేపీలోనే ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుభాష్‌చందర్జీ, నర్సింహ, డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులు, నియోజకవర్గం కన్వీనర్లు, వివిధ మోర్చాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రులతో స్నేహితుల్లా మెలగాలి

సరూర్‌నగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలివిడిగా ఉంటూ స్నేహితుల్లా మెలగాలని, అప్పుడే వారి మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా సంతోషంగా ఉండగలుగుతారని వందేమాతరం ఫౌండేషన్ కార్యదర్శి మాధవరెడ్డి పేర్కొన్నారు. బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఆదివారం నిర్వహించిన ఓరియంటేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యను కేవలం జీవితంలో ఆర్థికంగా స్థిరపడడానికే కాకుండా సమాజంలో మార్పు కోసం కూడా ఉపయోగించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ఎస్.చలమారెడ్డి, కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ రాంప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరదత్త, డీన్ డాక్టర్ ఆకుల గిరిధర్, ఫ్రెష్‌మెన్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ పి.గాయత్రీపావని, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్స్‌కాలనీ ఫేజ్-2 సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక



టీచర్స్‌కాలనీ ఫేజ్-2 నూతన కమిటీ సభ్యులు

వనస్థలిపురం : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్‌కాలనీ ఫేజ్-2 సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం జరిగిన కాలనీ సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కొట్ర శివ ముదిరాజ్ రెండోసారి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఏ.నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పీ.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా పొండు రంగారెడ్డి, వీరభద్రారావు, కోశాధికారిగా పీ.మహిపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఇప్ప శేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు శివ మాట్లాడుతూ తమ ఎన్నికకు కృషి చేసిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం

● అర్థాంతరంగా నిలిచిన వరదనీటి కాల్వ పనులు ● ఇబ్బందుల్లో ప్రజలు, పట్టించుకోని ప్రజాప్రతినిధులు

సైదాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం.. పట్టించుకోని ప్రజాప్రతినిధులు ప్రజల పాలిట శాపంగా మారింది. ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ ప్రధాన రహదారిపై చేపడుతున్న వరద నీటి కాల్వ పనులు ప్రారంభించి అర్థాంతరంగా నిలిపివేయడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సర క్రితం వరద కాల్వ పనులను కాంట్రాక్టర్ మొదలుపెట్టి కొంతమేర పూర్తి చేసి.. చేసిన పనికి బిల్లులు రావడం లేదని మధ్యలో ఆపివేశాడు. దీంతో వరదనీటి కాల్వ పైకప్పు తొలగించడం, మురుగునీరు నిలిచిపోవడంతో



తవ్విన కాల్వ చుట్టు నామమాత్రంగా ప్లాస్టిక్ కవర్‌తో రక్షణ చర్యలు



అపార్ట్‌మెంట్ గేటు ముందు సంవత్సరకాలంగా నిలిచిన కాల్వ పనులు

పరిసరాలు దుర్గంధంగా మారాయి. అంతేగాకుండా నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో భద్రతా చర్యలు చేపట్టకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కుంచించుకుపోయిన ఈ కాల్వను ఆధునికరించేందుకు ఎర్రగుంట చెరువు నుంచి ఎస్‌బీహెచ్‌కాలనీ వరకు మంజూరు చేశారు. పనులు రెండు సంవత్సరాల క్రితం ప్రారంభమైనా మధ్యలో నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులో అధికారులు ఆలస్యం చేస్తుండడంతో మధ్యలోనే పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కాల్వ గోడను తొలగించడంతో పాటు పూడికతీత మట్టిని ప్రధాన రహదారిపై సంవత్సర కాలంగా ఉంచడం రాకపోకలు సాగించే ప్రజలు నానావస్థలు పడుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే పరిసర కాలనీలకు వరద ముంపు వచ్చే అవకాశం లేకపోలేదని స్థానికులు అంటున్నారు.



లక్ష్మీనగర్‌లో వరద కాల్వ దుస్థితి

ప్రమాదం పొంచి ఉన్నా.. పట్టించుకోరా



లక్ష్మీనగర్ ప్రధాన రహదారిపై కాల్వగోడను తొలగించడం ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ దారి గుండా వేలాది వాహనాలు వెళ్తుంటాయి. ముఖ్యంగా పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కాంట్రాక్టర్ అసంపూర్తి పనులతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వ పనులు వేగవంతం చేయాలి.

- సీఎస్‌రెడ్డి, అధ్యక్షుడు, లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం

పార్కులో వాకింగ్ చేయలేకపోతున్నాం



లక్ష్మీనగర్‌కాలనీ పార్కు పక్కనే వరద నీటి కాల్వపై కప్పు తొలగించి ఉండడంతో దుర్గంధ వాసనతో వాకింగ్ చేయలేకపోతున్నాం. సుమారు సంవత్సరం నుండి ఇబ్బందులు పడుతున్నాం. కాల్వ రక్షణ గోడ తొలగించడంతో ఈ రోడ్డుపై నడవాలంటే ముఖ్యంగా చిన్నారులు, మహిళలు భయపడుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నర్సింహగౌడ్, లక్ష్మీనగర్ పార్కు, వాకర్ అసోసియేషన్

మల్కాజిగిరి, చేవెళ్లల్లో బీజేపీకి పెరిగిన ఓటింగ్ శాతం

● ఎంపీ ఈటల రాజేందర్

చాదర్‌ఘాట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో 2019లో 19శాతం ఉన్న బీజేపీ ఓటింగ్ శాతం 2024 ఎన్నికలకు 50 శాతానికి పైబడి పెరిగిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని హోటల్ బృందావన్‌లో ప్రతి 6 ఏళ్లకు నిర్వహించే సభ్యత్వ నమోదు కార్యక్రమ కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బీజేపీ వరుసగా మూడు దఫాలుగా అధికారంలో ఉందంటే అందుకు కారణం ప్రధాని మోదీ పరిపాలన ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే బీజేపీకి అత్యధిక మెజార్టీ ఇచ్చిన జిల్లా రంగారెడ్డి అర్బన్ జిల్లా అని సామ రంగారెడ్డిని అభినందించారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పోలింగ్ బూత్‌ల వారీగా 90శాతం సభ్యత్వ నమోదు చేయడమే జిల్లా ఎజెండా అని ఆయన అన్నారు. సభ్యత్వ నమోదుపై సామ రంగారెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ దళిత మోర్చా కార్యదర్శి ఎస్.కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, పక్కన సామ రంగారెడ్డి

తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

● ఏపీ మంత్రి సత్యకుమార్‌యాదవ్

ఎల్బీనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకరావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఏపీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్మాన్‌ఘాట్ గ్రీన్‌పార్క్ కాలనీలోని బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ సోలంకీ శ్రీనివాస్ నివాసంలో ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సత్యకుమార్ వీక్షించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయిలో బీజేపీని పటిష్టం చేయడం కోసం పార్టీ సభ్యత్వ నమోదులో పార్టీ కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోదీ నేతృత్వంలో దేశం వేగంగా పురోగమిస్తుందనీ, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా త్వరలోనే భారత్ మారనుందన్నారు. మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ తెలిపిన విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ తెలుగు భాషా ప్రాశస్త్యం, ప్రాముఖ్యతను కీర్తించడం, తెలుగులో తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, ధీరజ్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్‌కుమార్, సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధూ, సబ్బినేని శివరామకృష్ణ చౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.



మన్‌కి బాత్ కార్యక్రమంలో ఏపీ మంత్రి సత్యకుమార్

శివనారాయణపురంలో పాత ట్యాంకును తొలగింపజేస్తాం

● మేయర్ చిగిరింత పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 22వ డివిజన్‌లోని శివనారాయణపురం కాలనీలో గ్రామ పంచాయతీ కాలంలో నిర్మించిన పాత వాటర్ ట్యాంకును తొలగింపజేయడానికి చర్యలు తీసుకుంటామని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. దీనిపై త్వరలో మెట్రోవాటర్ బోర్డు అధికారులతో సమీక్ష జరిపి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆమె చెప్పారు. కాలనీలో నీటి ఎద్దడి నివారించే లక్ష్యంతో కొత్తగా చేపట్టనున్న తాగునీటి పైపులైన్ పనులకు ఆదివారం కార్పొరేటర్ లిక్కి మమతాకృష్ణారెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ కాలనీలోని పాత ట్యాంకు గురించి స్థానికులు మేయర్‌కు వివరించారు. దాని వల్ల ఉపయోగం లేకపోతే తొలగించడమే ఉత్తమమని వారు పేర్కొన్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ పాత ట్యాంకు విషయంపై సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో చర్చించి, దాని అవసరం లేదని నిర్ధారణ చేసుకున్నాక తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గట్టు బాలకృష్ణ, సుధీర్, అశోక్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.



తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై విపక్షాల దుష్ప్రచారం : దేప

ఎల్బీనగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పాలన చూసి బీఆర్ఎస్, బీజేపీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆర్కేపురం డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంట్, రూ. 500లకు సిలిండర్ పథకాలను అమలు చేస్తుండడం చూసి బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఓర్వలేకపోతున్నాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం, యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్‌ని పాతాళానికి తొక్కేశారన్నారు. అధికారం కోల్పోయిన బాధలో మాజీమంత్రి కేటీఆర్ ఆడపడుచులపై నోరు పారేసుకుని మహిళా కమిషన్ ముందు క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, పిట్టా హరినాథ్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, తలాటి రమేష్‌నేత, మహేందర్, లింగస్వామిగౌడ్, దుబ్బాక శేఖర్, జ్ఞానేశ్వర్‌యాదవ్, అక్బర్, పగడాల శ్రీశైలం, ఇస్మాయిల్, నబీ, కృష్ణ, పటేల్, పాషా, షఫీ, రేణుక, జయశ్రీ, మాధవి, లావణ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

భార్యతో గొడవపడి భర్త అదృశ్యం

సైదాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కుటుంబ నిర్వహణ ఖర్చులు అడిగితే భార్యతో గొడవపడి భర్త కనిపించకుండా పోయిన సంఘటన మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చావునీ నాదర్‌అలీ బేగ్‌లో నివాసముండే మహ్మద్ అక్బర్(34) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య సారాబేగం ఇంటి నిర్వహణ, పిల్లల స్కూల్ ఫీజు, కరెంట్ బిల్లులు కట్టేందుకు భర్తను డబ్బులు అడిగింది. దీంతో భార్యతో గొడవపడి ఆగస్టు 1న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాలేదు. అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మమతానగర్‌లో మహిళ..



మల్లీశ్వరి

కొత్తపేట: నాగోల్ పీఎస్ పరిధి మమతానగర్‌లో ఓ మహిళ విధులకు వెళ్లి ఇంటికి తిరిగి రాక అదృశ్యమైంది. మమతానగర్‌లో ఉండే గోగికర్ మల్లీశ్వరి(26) ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 24న ఉదయం 9.30 గంటలకు ఆమె విధులకు వెళ్లింది. రాత్రి ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో సోదరుడు గోగికర్ సాయినాథ్ ఆమెకు ఫోన్ చేస్తే, ఫోన్ స్విచ్ఛాఫ్‌గా ఉన్నట్లు గుర్తించాడు. కానీ అదే రోజు రాత్రి 10గంటలకు ఆమె సూర్యాపేటకు చెందిన సాయి అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంటున్నానని భావ రాజేష్‌కు ఫోన్‌లో మెసేజ్ పంపించింది. దీంతో ఆమె సోదరుడు గోగికర్ సాయినాథ్ ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బోనాల వేడుకలు

సైదాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మాదన్నపేట మండీలో ఆదివారం భూలక్ష్మి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల సంబరాల ఘనంగా జరిగాయి. మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు, ఉగాది మహేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఫౌండర్ రుద్ర నర్సింహ తెలిపారు.

డీఎస్‌నగర్‌లో..



డీఎస్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ శ్వేత

ఐఎస్‌సదన్ డివిజన్ డీఎస్‌నగర్‌లో ఈదమ్మ, ముత్యాలమ్మ ఆలయం ఆధ్వర్యంలో బోనాలు నిర్వహించారు. శివసత్తులు, పోతురాజుల నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చంపాపేట : చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలో బోనాల వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక గండమ్మతల్లీ ఆలయంలో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి గండమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

భయం వద్దు. భరోసాగా మేమున్నాం : సీపీ



సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు, తెలంగాణ ప్రభుత్వం, రాచకొండ పోలీసులు నిబద్ధతతో ఉన్నారని, వారికి అండగా షీటీమ్స్, భరోసా, డయల్ 100, సోషల్ మీడియా విభాగాలు ఉన్నాయని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. మహిళల భద్రత మనందరి బాధ్యత పేరుతో ఆదివారం వీడియోను విడుదల చేశారు. దాడులు, అత్యాచారాలు, వేధింపులు జరగకుండా ఉండాలంటే అమ్మాయిలు ఇలా ఉండాలి, ఇలా నడుచుకోవాలని తల్లిదండ్రులు అమ్మాయిలకు జాగ్రత్తలు చెబుతుంటారు. కానీ నిజానికి ఇది మాత్రమే సరిపోదు. అబ్బాయిలకు కూడా మహిళలను గౌరవించే సంప్రదాయం నేర్పించాలి. చిన్నతనం నుంచి మన సొంతవారే కాకుండా బయట అమ్మాయిలు కూడా మన అమ్మ, చెల్లి, అక్క వంటి వారేనని వారిని కూడా గౌరవించాలనే సంస్కారం నేర్పించాలి. అప్పుడే అమ్మాయిల పట్ల అబ్బాయిల అభిప్రాయం, ఆలోచన తీరు మారుతుంది. అంతేకాకుండా మహిళలకు అండగా షీటీమ్స్, భరోసా, డయల్ 100 వంటి వాటితోపాటు కఠిన చట్టాలు మహిళలకు అండగా ఉన్నాయని తెలిపారు.

మందకృష్ణకు సన్మానం



అబ్దుల్లాపూర్‌మెట్ : ఎస్సీ వర్గీకరణ పోరాటంలో విజయం సాధించిన ఉద్యమ నేత మంద కృష్ణమాదిగను ఆదివారం ఆయన నివాసంలో సామాజిక జన జాగృతి సమితి నేతలు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తొంట బాబు, ప్రధాన కార్యదర్శి గుండె యాదగిరి, యువజన అధ్యక్షుడు ఉపేందర్, శివకుమార్‌తో పాటు పలువురు మందకృష్ణకు సన్మానం చేసి మిఠాయిలు తినిపించారు.

భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

ఎల్బీనగర్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీలోని రోడ్డు నం.1 కాలనీ అసోసియేషన్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ కోరారు. టెలిఫోన్ కాలనీలోని సరస్వతి ఆలయం వద్ద ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి అరవింద్‌శర్మ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెలిఫోన్ కాలనీ అసోసియేషన్ భవన నిర్మాణానికి గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సబితారెడ్డి సుమారు రూ.35లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. నిధులు సరిపోకపోవడంతో భవన నిర్మాణపు పనులు ఆగిపోయిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే అధిక నిధులు కేటాయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిపారు. ప్రభుత్వం ఆ నిధులను తక్షణమే విడుదల చేసి అసోసియేషన్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, శ్యాంగుప్తా, కపిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, పక్కన ఇన్‌స్పెక్టర్ రాజు

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

చాదర్‌ఘాట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవడంలో అన్ని వర్గాల ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓల్డ్‌మలక్‌పేట హౌసింగ్ బోర్డు కాలనీలో గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు, స్థానికులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించే ఉత్సవ సమితి నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. నగర పోలీసు కమిషనర్ విధించిన ఆదేశాల మేరకు గణేశ్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ఆయన కోరారు. పోలీసుల నిబంధనలను అతిక్రమించినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా వారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉత్సవ సమితి నిర్వాహకులు కూడా ఆయా మండపాల వద్ద రౌండ్ ది క్లాక్‌గా అందుబాటులో ఉండాలన్నారు.

ఆర్టీసీ ప్రగతి చక్ర అవార్డుకు నర్సింగ్‌రావు ఎంపిక



నగదు పురస్కారం అందుకుంటున్న నర్సింగ్‌రావు

హయత్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్టీసీ సంస్థ ప్రతి సంవత్సరం అందించే ప్రగతి చక్ర పురస్కార అవార్డుకు హయత్‌నగర్-1 డిపోకు చెందిన ఏడీసీ ఎన్. నర్సింగ్‌రావు ఎంపికయ్యారు. శనివారం ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా నర్సింగ్‌రావుకు రూ. 51,500 నగదు, ప్రశంసాపత్రాన్ని అందించారు. అనంతరం నర్సింగ్‌రావును ఘనంగా శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా హయత్‌నగర్ -1 డిపో మేనేజర్ విజయ్ ఏడీసీ నర్సింగ్‌రావును అభినందించారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన విద్యార్థులు

చంపాపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల కర్ణాటకలోని శివమొగ్గలో జరిగిన 5వ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో హస్తినాపురం డివిజన్‌లోని సీకే మార్షల్ ఆర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థులు సత్తాచాటి 14పతకాలు సాధించినట్లు గ్రాండ్ మాస్టర్ రాజునాయక్ తెలిపారు. శ్రీకీర్తి, అర్జున్, ప్రణవ్ తదితరులు అమెరికన్ గ్రాండ్ మాస్టర్ సోఫీమౌస్లే చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నట్లు ఆయన తెలిపారు. రాంచరణ్, సందీప్, మనస్విక, అక్షర, రజిత, మురారీ, కాంస్య పతకాలు సాధించారు. చాపల కిషోర్, చాపల మానస పాల్గొన్నారు.